# బుడగలు

తాలూకాఫీసు ఆవరణలో, వేపచెట్టు కింద నీడలో, కాళ్లారజాపుకొని వలయాకారంలో కూచున్న ఆరుగురిలో యిద్దరు బీడీలు కాలుస్తున్నారు, యిద్దరు సిగరెట్లు పీలుస్తున్నారు; మరో ఇద్దరు ఒకే పేపరులో తలదూర్చి వార్తలు చదువుతున్నారు. వాళ్లారుగురూ పాతిక మొదలుకొని నలభై ఏళ్ళవరకూ వివిధ వయసుల్లో వున్నారు. వారిలో ముగ్గురి చేతులకు మాత్రమే గడియారాలున్నాయి. ఆ మూడు గడియారాలకూ ఏకాభిప్రాయం వున్నట్టులేదు. పదిగంటలా 15 నిమిషాల నుండీ, పదిన్నరవరకూ ఆ గడియారాలు కాలాన్ని మూడు విధాలుగా సూచిస్తున్నాయి. సాదా పంచెకట్టు నుండీ బెల్‌బాటమ్ వరకూ వారి దుస్తుల్లో పరిణామం కనిపిస్తోంది. వారు ఆరుగురూ ఉపాధ్యాయ వృత్తికి చెందినవారు.... 320 బేసిక్ నుండీ 460 బేసిక్ వరకూ వారి జీతాలున్నాయి. వారిలో ఎవ్వరూ స్థానికులు కారు. ఆ తాలూకాలోని మూడు స్కూళ్ళకు చెందినవారు. అయినా అందరికీ ఒకరితో ఒకరికి కొద్దో గొప్పో పరిచయం వుంది. వారందరూ గత సంవత్సరం ఏప్రిల్‌లో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో పిల్లలు కాపీలు కొట్టకుండా పర్యవేక్షణ చేయటానికి ఆ తాలూకా కేంద్రంలోని జూనియర్ కాలేజీ సెంటర్లో 'అసిస్టెంట్ సూపరింటెండెంట్లు' గా (ఇన్విజిలేటర్స్‌గా) పని చేసినవారు. ఆ పని చేసినందుకు పదినెలల తర్వాత వచ్చిన తమ టి.ఎ. బిల్స్‌ను వసూలు చేసుకొనేందుకు ఇప్పుడు తాలూకాఫీసుకు వచ్చారు. ఇంతకు

మునుపైతే 'బిల్స్' అన్నీ హెడ్మాస్టర్ల పేరనే వచ్చేవి. వారే వాటిని క్యాష్ చేసి ఎవరి డబ్బును వారికి పంచేవారు. ఈసారి అలా కాకుండా ఎవరి 'బిల్స్' వారి పేరనే రావటంతో తప్పనిసరిగా అందరూ తాలూకాఫీసు దర్శనం చేసుకోవాల్సి వచ్చింది.

పది గంటలు దాటుతూండగా వారందరూ అక్కడకు చేరుకున్నారు. తమ 'బిల్స్'ను అందుకు సంబంధించిన గుమస్తా చేతికిచ్చి పెట్టమన్నచోట సంతకాలు పెట్టి 'టోకన్స్' కోసం ఎదురుచూస్తూ వేపచెట్టు నీడలో కూలబడ్డారు. ఆ 'టోకన్' చేతికొస్తే, దాన్ని తీసుకొని మరీ 'స్టేట్ బాంక్' కెళ్ళాలి. అక్కడ నగదు యిస్తారు. ఇదీ పద్ధతి.

పేపర్లో తలదూర్చిన వారిలో ఒకరు తటాలున తల పైకెత్తి ఒక గొప్ప అద్భుతం కనుగొన్నవానిలా మిగతా వారికేసి చూస్తూ, "ఈ వార్త చదివారా? ఆవు కడుపున పందిపిల్ల పుట్టిందట" అన్నాడు. అతడు అక్కడికి పదిమైళ్ళ దూరంలో వున్న కొత్తపల్లె హైస్కూల్ సైన్స్ టీచర్ వెంకటరమణ.

ఎక్కడ? ఏ వూళ్ళో? వెళ్ళి చూసి వద్దామా అన్నంత వుత్సుకతతో ప్రశ్నించాడు అదే హైస్కూలు తెలుగు పండిట్ రామ్మూర్తి.

"పూనా దగ్గర పల్లెలోనట"

రామ్మూర్తి ఉత్సాహం చల్లారిపోయింది. అంత దూరమవటంవల్ల తనకు చూసి వచ్చే ఛాన్స్ లేకపోయినందుకు! అతడికి అద్భుతాలంటే మహా మోజు!

"మావూరి దగ్గర నా చిన్నప్పుడు గాడిదకు ఆవుదూడ పుట్టింది...." అన్నాడు రామాపురం సోషల్ టీచర్ నారాయణప్ప; పేపరు చదువుతూన్న రెండో వ్యక్తి.

"నువ్వు చూశావా? ఎలా వుంది?" రామ్మూర్తి ప్రశ్న.

"నేను చూడలేదుగాని మా వూరి నుండి జనం చాలామంది వెళ్ళి చూసొచ్చారు...."

"ప్చ్.... ప్రపంచంలో ఎన్ని అద్భుతాలో! ఈ సృష్టి రహస్యం ఎవరికర్థమవుతుంది.....!" అప్పుడే పాతికేళ్ళు దాటిన వెంకటగిరి లెక్కల టీచర్ బెల్‌బాటమ్ ప్రసాద్ వేదాంతం వొలకబోశాడు.

"బుద్ధిలేకుంటే సరి. ఆ వెధవ వార్త వాడు చదవటమూ మీరు కామెంట్ చేయడమూ-; ఆవుకెక్కడయినా పందిపిల్ల పుడుతుందా అనే ఆలోచన కూడా లేకుండా! అంత పేపరు అరగంట చదివిన తర్వాత నీకు దొరికిన వార్త యిదట్రా!"-ప్రకాశం మందలించాడు. అతడు కొత్తపల్లె హైస్కూల్‌లోనే లెక్కల టీచర్.

"సరేలేవోయ్! నీ కథ తెలిసిందేగదా! పేపర్లో పడిన వార్తను కూడా నమ్మవద్దంటావ్-" వెంకటరమణ ముఖం మాడ్చుకున్నాడు.

"నమ్మి నువ్వు రెండు పందిపిల్లల్ని కనవోయ్ - మధ్య నాదేం పోయింది?"

"పందిపిల్లల కథ మళ్ళీ ఆలోచిద్దాంగాని ముందు ఆ టి. ఎ. బిల్స్ ఎంత వరకూ వచ్చాయో చూడండర్రా' అన్నాడు అక్కడున్న వారిలో వయసులో పెద్దవాడయిన వెంకటగిరి హిందీ పండిట్ రాజప్ప.

"నేను వెళ్ళి విచారించుకొని వస్తా" అంటూ లేచి బట్టల కంటిన దుమ్మును దులుపుకొని ఆఫీస్ వేపు వెళ్ళాడు నారాయణప్ప.

"అడివిరాముడు యింకా ఆడుతోందిరోయ్! 250 వరోజట" పేపర్‌లోకి సీరియస్‌గా వంగి చూసి ప్రకటించాడు రామ్మూర్తి.

"ముందు ఆ పేపర్ మూసేస్తావా? మళ్ళీ నా నోటికి మంచిమాటలు రావు" గట్టిగా కసిరాడు ప్రకాశం.

"ఇంకేమిటోయ్ నీకు నచ్చేది? సరదాకోసం పేపర్ చదవడమూ తప్పేనా?" వెంకటరమణ విసురుగా అన్నాడు.

"మీ వాలకం చూస్తే పోట్లాడుకొనేలా వున్నారు - మనమిక్కడికి వచ్చినపని పూర్తయిన తర్వాత, తీరిగ్గా హోటల్‌లో కూచొని మీ ఖర్చుమీద ఎంత సేపయినా వాదించుకుందాం" నవ్వుతూ అన్నాడు రాజప్ప.

ప్రకాశం కూడా నవ్వి సిగరెట్ వెలిగించాడు.

రామ్మూర్తీ, వెంకటరమణా మళ్ళీ పేపర్లోకి తలలు దూర్చారు.

"మన 'పేస్కేల్స్' విషయమై ఏమైనా 'స్టేట్‌మెంట్స్' వున్నాయా?" అంటూ ప్రసాద్ కూడా ఒక పేపర్ ముక్కను లాక్కున్నాడు.

నారాయణప్ప సరాసరి అక్కడికి వచ్చి "ఈరోజు మనపని అయినట్లే" అంటూ వాళ్ళ మధ్య కూలబడ్డాడు.

"ఏం? వాడితో ఏం పని" అడ్డు ప్రశ్న వేశాడు రామ్మూర్తి— రామ్మూర్తికి తాలూకాఫీసు వ్యవహారమేం తెలియదు. అతడు తాలూకాఫీసుకు రావటం యిది మొదటిసారి.

"వున్న పనంతా వాడితోనేనయ్యా స్వామీ! ఆయనగారే మన బిల్స్‌ను పాస్ చేసే మహానుభావుడు -" అన్నాడు నారాయణప్ప.

"పదిన్నర దాటినా ఆఫీసుకు రాకుండా ఏం గాడిదలు కాస్తున్నట్టు ఈ ఆఫీసర్‌గాడు...." అన్నాడు వెంకటరమణ పేపర్ మడిచి వేస్తూ.

"వాడు రోజూ యింతేనట. అనంతపురం వాడి సొంత వూరంట. అక్కన్నుండే రోజూ 11 గంటలకు యిక్కడకు వస్తాడట -" నారాయణప్ప జవాబుతో వారందరూ దాదాపు చల్లబడ్డారు.

"ఈ రోజు శనివారం గదా! 12 గంటలలోగా మనం స్టేట్ బ్యాంక్ కి వెళ్తేనే పని జరిగేది. ఇక అయినట్టే.... ఆ ఆఫీసర్ వచ్చేదెపుడు? బిల్స్ పాస్ చేసేదెపుడు? టోకన్స్ చేతికొచ్చేదెపుడు? ఇంతలో ఆ పుణ్యకాలం కాస్తా దాటిపోతుంది" రాజప్ప నిస్పృహగా అన్నాడు.

"ఈ ఆఫీసర్‌గాడికేమైనా బుద్ధుందా? ఇది ఆఫీసనుకున్నాడా? వాడి స్వంత ఇల్లనుకున్నాడా? వాడి యిష్టమొచ్చినప్పుడు రావడానికి-" వెంకటరమణ కోపంతో చిందులు తొక్కసాగాడు.

"ఎంతోమంది తమ పనులకోసం పరాయి వూళ్ళనుండి యిక్కడికి వస్తారన్న జ్ఞానం వాడికేమైనా వుందా? తనకోసం జనం కాచుకు కూచునుంటే వాడికదొక ఆనందం-" నారాయణప్ప మాటల్లోనూ, ముఖంలోనూ కూడా కోపం బయటపడింది.

"అధికారమోయ్ అధికారం! నువ్వూ, నేనూ ఈ దేశంలో తిక్కనాకొడుకులం.... సరిగ్గా పదికి పది నిమిషాల ముందే స్కూల్‌కు వెళ్ళటం, నాలుగున్నర దాకా చచ్చినట్టు వుండటం.... ఏ మాత్రం హెచ్చుతగ్గులయినా, ఎక్స్‌ప్లనేషన్లూ, మెమోలూ...." ప్రకాశం గగ్గోలు పెట్టాడు.

"అసల్కు యీ దేశంలోనే అధికారం పనికిరాదండీ! ఏ కాస్త అధికారమున్నా వాడి ప్రవర్తన మారిపోతుంది. దేశమంతా తన కాళ్ళకింద వున్నట్టే 'పోజ్' పెడతాడు వాడు—" రాజప్ప అగ్గిపుల్ల చప్రున వెలిగిస్తూ అన్నాడు.

"ఎవడైనా అడిగే నాథుడుంటే గదా! వాని యిష్టం వాని రాజ్యం" రామ్మూర్తి ఉవాచ.

ప్రసాద్ నిమిత్తమాత్రుడిలాగా వీళ్ళందరి సంభాషణల్నీ మౌనంగా మెదడులో టేపు చేసుకుంటున్నాడు. ఈ రోజు డబ్బు చేతికొస్తే కొనాల్సిన

సరుకుల లిస్టు అతని కళ్ళముందు వెలవెలా బోతోంది. చెప్పలేని నిరాశ అతని కళ్ళలో కదులుతోంది.

"అసలు హెడ్‌క్వార్టర్స్‌లో వుండకుండా కాపురం అనంతపురంలో పెట్టి రోజూ ఆలస్యంగా తిరగడానికి వీడికెంత ధైర్యం?" నారాయణప్ప మండి పోతున్నాడు.

"అనంతపురం నుండీ ఏం ఖర్మ? హైదరాబాద్ నుంచైనా తిరుగుతాడు. వాడిసొమ్ము ఏం పోయింది? రోజూతేరగా యిక్కడ లంచాలు గుంజుతాడుగా" వెంకటరమణ ఆక్రోశం.

"అంతో యింతో యిస్తే తప్ప ఏ ఆఫీసులోనూ పని జరగని కాలం యిది! లంచాలు తీసుకునేదిగాక వీళ్లు పెట్టే పోజ్ చూడాలి! అరికాలిమంట నెత్తికెక్కుతుంది" నిజంగా మంట నెత్తికెక్కిన వానిలాగే మాటాడుతున్నాడు రాజప్ప.

పది నిమిషాల సేపు తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టి వారందరూ వేపచెట్టు పక్కనే వున్న కాంటీన్‌లోకి వెళ్ళి కట్ కాఫీలుతాగి, మళ్ళీ వేపచెట్టు నీడలోనే కూలబడ్డారు.

"ఇప్పుడేం చేద్దామంటారు?" జనాంతికంగా ప్రశ్నించాడు ప్రసాద్.

"వాడు పదకొండు గంటలకు వచ్చినా మనకు సకాలంలో బిల్స్ పాసవుతాయంటారా?" రామ్మూర్తి అనుమానంగా అడిగాడు.

"ఎందుకు చేయడు? నడ్డి విరగదంతే సరి" వెంకటరమణ కటువుగా నొక్కి అన్నాడు.

"ఏమైనా గాని ఈ రోజు వీడి అంతు తేల్చాల్సిందే!" ప్రకాశం.

"ఎట్లాగా?" - ప్రసాద్.

"వీడు రోజూ యిలాగే గంట ఆలస్యంగా ఆఫీసుకు వస్తున్నాడనీ, ప్రజలకు చాల యిబ్బంది కలిగిస్తున్నాడనీ, వెంటనే చర్య తీసుకోమనీ కలెక్టరుకు టెలిగ్రాం యిద్దాం-"

"వీడు ఆఫీసుకు రాగానే నిలబెట్టి ఘెరావో చేద్దాం"

"దిన పత్రికలకు కూడా సంపాదక లేఖలు రాద్దా"

"ముఖ్యమంత్రికీ, రెవిన్యూమంత్రికీ పిటిషన్లు పంపుదాం -"

"మన పిటిషన్లకు అసలు ఒక విలువంటూ వుంటుందా - అందరూ అందరే-" ప్రసాద్ శంక.

"అలా ఎందుకనుకోవాలి. బాధ్యతకల వ్యక్తులుగా మన కర్తవ్యం మనం నెరవేరుద్దాం" ప్రకాశం.

"వీడికి మాత్రం శాస్తి జరగాల్సిందే"

"మరి రాయండి"

"తెల్ల పేపరు తీసుకోండి"

"తెల్ల పేపర్ ఎందుకోయ్. ముందు కలెక్టర్‌కు టెలిగ్రాం యిద్దాం-"

"దానికి మళ్ళీ బోలెడు ఖర్చు"

"ఎంత ఖర్చులేవోయ్? తలా ఓ రూపాయ వేసుకుందాం-"

"వేసుకుందాం...."

"సరే...."

"సరే...."

"మరి 'మాటర్' రాయండి"

"ఈ దెబ్బతో వీడి పొగరణగాలి"

ఒక్కొక్కరు వారి వారి బీడీలూ సిగరెట్లూ మూడు నాలుగు తక్కువగాకుండా కాల్చి కాల్చి ఏకాభిప్రాయానికి వచ్చారు.

వెంకటరమణ పేపరు ముక్క తీసుకొని టెలిగ్రాం మాటర్ రాయటానికి పెన్ను విదిలిస్తున్నాడు.

ఇంతలో వారు కూచున్న వేపచెట్టు పక్కగా ఒక రిక్షా ఆఫీసు వైపు వెళ్ళటం వారందరి దృష్టినీ ఆకర్షించింది.

రిక్షా ఆఫీసు మెట్లు దగ్గర ఆగింది.

రిక్షా నుండి దిగిన వ్యక్తి అప్పుడే మేక పిల్లను తిన్న కొండ చిలువలా వున్నాడు. అతను తొడుక్కున్న టెర్రీకాటన్ దుస్తుల్లో బలిసిన కండలునున్నగా కన్పిస్తున్నాయి. అతని మెడమీద వేలాడుతున్న జులపాలు ఏడుకొండల వానికోసం పెంచినట్టున్నాయి. అతని ముక్కు మీదున్న సన్నటి కుంకుమ బొట్టు రక్తపు చుక్కలా వుంది.

అతడు రిక్షా దిగగానే చేతిలోవున్న బాగ్‌ను హొయలుగా ప్యూను చేతి కందించి మెల్లమెల్లగా మెట్లెక్కి ఆఫీస్ రూమ్‌లోకి జారుకున్నాడు.

"వీడే ఎస్టీవో' అన్నాడు రాజప్ప తక్కిన వారితో.

వెంకటరమణ చేతి గడియారం కేసి చూసి " పదకొండూ పది " అన్నాడు. అందరూ కూడబలుక్కున్నట్టుగా ఒక్కసారిగా లేచి నిలబడ్డారు.

"పోదాం పదండి బిల్సు వెంటనేపాస్ చేయమని అడుగుదాం."

"పదండి"

అందరూ ఒక్క వూపుతో ఆఫీస్ వరండాలోకి వచ్చి పడ్డారు.

రెండు నిమిషాల సేపు అటూ యిటూ తచ్చాడారు.

వరండాకు ఎదురుగా వున్న సీట్లో సింహాసనం మీది రాజులా నిటారుగా కూచొని సిగరెట్ పీలుస్తున్నాడు ఎస్టీవో.

వయసులో పెద్దవాడయిన రాజప్ప ముందు నడవగా వెనక మిగతా వాళ్ళు ఆఫీసులోకి అడుగు పెట్టారు

"నమస్కారం సార్" రాజప్ప కుడిచేతిని తేలిగ్గా గాలిలో ఆడించాడు.

ఎస్టీవో సిగరెట్ పొగను విలాసంగా వదిలి ఏమిటి అన్నట్టు నింపాదిగా చూశాడు వారి వైపు.

"మా టి.ఎ. బిల్స్ పది గంటలప్పుడు యిచ్చాం సార్" రాజప్ప.

"ఈ రోజు శనివారం సార్" నారాయణప్ప.

"బాంక్ టైమ్ దాటిపోతుంది సార్" రామ్మూర్తి.

"చాలాదూరంనుండీ వచ్చాం సార్" ప్రసాద్.

"మీరు వెంటనే పాస్ చేస్తే...." వెంకటరమణ.

ఎస్టీవో సిగరెట్ ముక్కను తటాలున నలిపివేసి, "వచ్చి ఐదు నిమిషాలుకూడా కాలేదు నేనేం నిద్రపోతున్నాననుకున్నారా చేస్తామండీ చేస్తాం" అన్నాడు తన సహజ ధోరణిలో.

"అలాగే సార్.... కాని బాంక్ టైమ్" ప్రకాశం.

"ఈ రోజు శనివారం గాబట్టి...." ప్రసాద్.

"చెప్పేది మీకు గాదేమండీ ఇంతమంది యిలా ఆఫీస్‌లోకి వస్తే ఎలాగండీ పనులు జరగాలా వద్దా ముందు మీరు వరండాలోకి వెళ్ళండి. రొటీన్ కోర్సులో వర్క్ జరుగుతుంది" గట్టిగానే గదురు కున్నాడు ఎస్టీవో.

ప్రకాశానికి కోపం కుత్తుక దాకా వచ్చింది.... ఏదో అనబోతూండగా రాజప్ప మోచేత్తో నడుముకు పొడిచాడు. ప్యూను వచ్చి ''వరండాలోకి రండయ్యా'' అని పిలిచాడు. అందరూ వరండాలోకి చేరుకొని ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

''దొంగ నా కొడుకు.... ఆలస్యంగా వచ్చి పైగా మనల్నే దబాయిస్తున్నాడు'' గొణిగాడు ప్రకాశం.

''మెల్లగా వాడికి వినపడేను'' నారాయణప్ప

''ఏం తల తీస్తాడా ?'' ప్రకాశం.

''ఐతే లోపలికి పెళ్ళి అరవ్వోయ్'' వెంకటరమణ.

''అబ్బ! మళ్ళీ గొడవ వాణ్ని మనం యిప్పుడేమైనా అంటే వచ్చే నష్టం మనకే మన 'బిల్స్'లో ఏదైనా 'క్వొరీ' వేస్తే మళ్ళీ చావాలి'' రాజప్ప.

''మళ్ళీ డి.ఇ.ఓ. ఆఫీస్‌కు వెళ్ళాలి'' నారాయణప్ప.

''మళ్ళా మూడు నెల్లవుతుంది'' రామ్మూర్తి.

''ఎట్లో పది నిముషాలు ఓపిక పట్టి పని సాధించుకోవాలి'' రాజప్ప.

అందరూ నిమిషనిముషానికీ లోపలకు తొంగిచూస్తున్నారు.

పదకొండూ ముప్పయ్ ఐదు....

వరండాలో తొక్కిసలాడుతున్నారు....

నారాయణప్ప నాలుగడుగులు లోపలకు వేసి, ''చాలా దూరంనుండీ వచ్చాం సార్.... బ్యాంక్ టైమ్ దాటిపోతే మళ్ళీ ఒకరోజు రావాలి....ప్లీజ్'' వినిపించేలా అన్నాడు.

ఎస్టీవో తలెత్తి పురుగును చూసినట్టు చూచి మళ్ళీ తన పనిలో తాను మునిగి పోయాడు.

ప్యూను బయటకు వచ్చి వారందర్నీ సైగ చేసి స్తంభం చాటుకు పిలిచాడు. అందరూ వుత్సాహంగా దగ్గరకు చేరారు.

"అయ్యగారికిచ్చే మామూలివ్వండయ్యాప నయిపోతుంది" అంటూ చేయి చాచాడు.

అందరూ ఒకరు ముఖాల్లోకి ఒకరు చూసుకున్నారు.

"ఏదో ఒకటి అంతో యింతో యిద్దాం మళ్ళీ సోమవారం రావాలంటే ఒక్కొక్కరికి ఐదు ఖర్చవుతుంది. పైగా లీవు కూడా వేస్టు.... పెద్దరికం వహించాడు నారాయణప్ప.

ఆరుమందీ కలిసి పద్దెనిమిది రూపాయలు ప్యూను చేతిలో పెట్టారు.

"ఐదు నిముషాల్లో టోకన్లు తెచ్చి యిస్తాను సార్" ప్యూను లోపలకు పరుగు తీశాడు.

"రాస్కెల్స్ చెప్పుల్తో కొట్టాలి.... డబ్బు తీసుకుంటూ కూడా పెద్ద పోజ్" ప్రకాశం పళ్ళు కొరికాడు.

ప్యూను టోకన్స్ తీసుకొని వారి దగ్గరకు వచ్చి "ఇవిగో సార్" అంటూ కుడి చేతిలో టోకన్స్ పట్టుకొని ఎడమ చెయ్యి చాచాడు.

అర్థమయినట్టుగా తలలాడించి, ఒక్కొక్కరు ఒక్కో పావలా ఆ ఎడమ చేతిలో పడేసి, టోకన్స్ తీసుకొని గడియారాల్లో టైమ్ చూసుకుంటూ, స్టేట్‌బాంక్ వేపు ఒకటే పరుగో పరుగు.

*

(రచనకాలం - జూన్ 79. ప్రచురణ : విపుల - సెప్టెంబర్ 79.)